
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 ; కనిష్ఠం 19.8



కామారెడ్డి

జిల్లా వార్తలు

3

సోమవారం 3 ఫిబ్రవరి 2025

నెంబర్ ప్లేట్ లేని వాహనాల సీజ్

గాంధారి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గత వారం రోజుల నుంచి నెంబర్ ప్లేట్‌లు లేని వాహనాల కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టి 50 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. గాంధారి పరిధిలో ఎక్కడైన నెంబర్ ప్లేట్ లేని వాహనాలు తిరిగినట్లయితే వాటిపై జరిమానాతో పాటు పూర్తిగా సీజ్ చేస్తామన్నారు. వాహనాలు దొంగతనం, గొలుసు దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ఇచ్చితంగా ప్రతీ ఒక్క వాహనదారుడు నెంబర్ ప్లేట్ పెట్టుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్వహణకు నిధుల కరువు

- ప్రభుత్వాలు, పాలకులు మారినా నిధుల కేటాయింపు ఊసే లేదు
- వరద గేట్ల ఆయిలింగ్, గ్రీసింగ్ పనులకే మొక్కుబడిగా నిధుల కేటాయింపు



5

ఆర్గొండలో పని చేయని నిఘా నేత్రాలు

- సంవత్సరాలు గడుస్తున్నా కెమెరాలపై దృష్టి సారించని వైనం
- ఆర్గొండలో పూర్తిగా పాడైన కెమెరాలు
- మరమ్మతులు చేయించాలంటున్న గ్రామస్థులు



5

విద్య నేర్పుతూ.. జీవితాల్లో వెలుగులు నింపుతూ!

- ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన
- కళాహీనంగా ఉన్న పాఠశాలకు కొత్త కళ తెచ్చిన ఉపాధ్యాయులు
- విద్యార్థులను ఆకర్షిస్తున్న పెద్దకొడప్‌గల్ విద్యాలయం



5





ఎమ్మెల్సీ ఎన్నికల.. హడావుడి!

- శాసనమండలి ఎన్నికలపై దృష్టి సారించిన ప్రధాన పార్టీలు
- ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ఖరారు
- బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది తేలాల్సి ఉంది
- పోటీ చేసేందుకు పలువురు స్వతంత్ర అభ్యర్థులు
- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్, బీజేపీ
- పార్టీ శ్రేణులతో పాటు పట్టభద్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు
- ఇప్పటికే ఎన్నికలపై షెడ్యూల్ జారీ చేసిన ఎన్నికల కమిషన్
- కరీంనగర్‌లో నేటి నుంచి నామినేషన్‌ల ప్రక్రియ

కామారెడ్డి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ హడావిడి మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఇటీవల షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించాయి. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ బీజేపీలు పావులు కదుపుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. ఎన్నికల ప్రచారంపై ఈ రెండు పార్టీలు దృష్టి సారించి పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్లతోనే కాకుండా క్షేత్రస్థాయిలో పార్టీశ్రేణులతో సమావేశాలు ఏర్పాటు చేస్తు ఓట్ల వేటలో పడ్డాయి. అయితే ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లా యంత్రాంగం సైతం సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం పోటీ చేసే అభ్యర్థుల నుంచి కరీంనగర్‌లో నేటి నుంచి నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగనుంది.

ఎమ్మెల్సీ స్థానంపై కాంగ్రెస్ గురి

శాసన మండలిలో బలం పెంచుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ గురి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాగా వేయాలని కాంగ్రెస్ ఆలోచిస్తోంది. ప్రస్తుతం కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచే గత ఎన్నికల్లో గెలుపొందారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తమరెడ్డి ఉన్నారు. వీరి పదవీకాలం మార్చిలో ముగియనుంది. ఆలోపే ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించింది. షెడ్యూల్ వెలువడిన వెంటనే కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటించింది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని ప్రకటించారు. ఈ సారి పట్టభద్రుల ఎమ్మెల్సీ పోటీకి సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆసక్తి కనబరచకపోవడంతో అధిష్టానం నరేందర్‌రెడ్డిని ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేల ఏకాభిప్రాయంతోనే అభ్యర్థిని ప్రకటించారు. ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉమ్మడి జిల్లాల పరిధిలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. అభ్యర్థి ప్రకటన కావడంతో ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించనున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో దూకుడుగా బీజేపీ

ఉమ్మడి కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ దూకుడుగా ఉన్నట్లు తెలుస్తోంది. మొట్టమొదటగా బీజేపీ ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థులను ప్రకటించింది. ఈ ఎన్నికల్లో బీజేపీ ఎలాగైన ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకుని శాసన మండలిలో అడుగు పెట్టాలని భావిస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొమురయ్యలను ప్రకటించింది. సంవత్సరం కిందట జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి విద్యావేత్తల నుంచి మంచి ఓటు బ్యాంకు లభించడంతో ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే కామారెడ్డి జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సారథ్యంలో అభ్యర్థులతో కలిసి బీజేపీ శ్రేణులతో పాటు అనుబంధ సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు.

అభ్యర్థిని ప్రకటించని బీఆర్ఎస్

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ తమ అభ్యర్థిని ఇప్పటికీ ప్రకటించలేకపోయింది. ఈ ఎన్నికల్లో అభ్యర్థిని పోటీలో దించడం లేదన్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ స్థానాల నుంచి పోటీ చేసేందుకు ఆ పార్టీ నుంచి ఎవరు కూడా ముందుకు వస్తలేరన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఎవరు కూడా సాహసం చేయడం లేదు. ఆ పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ ఎన్నికల కంటే స్థానిక సంస్థల ఎన్నికలపైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. నేటి నుంచి నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభం కానున్నందున బీఆర్ఎస్ చివరి వరకు ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తుందో లేదో చూడాలి. అయితే కొందరు స్వతంత్ర అభ్యర్థులు ఈ ఎమ్మెల్సీ స్థానాల నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పలువురు విద్యావేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు ఎమ్మెల్సీ స్థానాలకు బరిలో ఉండాలని ఇప్పటికే ప్రచారం చేపడుతూ వచ్చారు. ఏదిఏమైన ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే పోటీ ఉండనున్నట్లు తెలుస్తోంది.

నేటి నుంచి నామినేషన్‌ల ప్రక్రియ

ఉమ్మడి కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ఇది వరకే విడుదలైన విషయం తెలిసిందే. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లాలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో పట్టభద్రుల ఓట్లు 15,876 ఉపాధ్యాయ ఓట్లు 2,061 ఉన్నాయి. ఈ ఎన్నికల అధికారిగా కరీంనగర్ కలెక్టర్ వ్యవహరించనున్నారు. మిగతా ఉమ్మడి జిల్లాల కలెక్టర్‌లు అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా ఉంటారు. సోమవారం నుంచి నామినేషన్‌ల ప్రక్రియ మొదలుకానుంది. పోటీ చేసే అభ్యర్థులు కలెక్టర్‌కు నామినేషన్‌లు దరఖాస్తు చేయనున్నారు. ఈ నెల 27న ఎన్నికలు జరగనుండగా మార్చి 3న కౌంటింగ్ చేపట్టనున్నారు.


నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



సైన్స్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న నోడల్ అధికారి షేక్ సలాం

- జిల్లాలో 48 కేంద్రాల ఏర్పాటు
- మూడు విడతల్లో పరీక్షలు
- మొదటి విడతలో 20 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 18,467 మంది విద్యార్థులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు మొదలు కానున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 84 ఉన్నాయి. మొత్తం 18,467 మంది ద్వితీయ సంవత్సరం, ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 6,828 మంది, ఒకేషనల్ 1915 మంది, ద్వితీయ సంవత్సరం 8,335, ఒకేషనల్ 1,389 మంది ఉన్నారు. ఈ మేరకు సోమవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలను మూడు విడతలుగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 48 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొదటి విడతలో 20 పరీక్షల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆదివారం సాందీపని కళాశాలతో పాటు పలు కళాశాలలను నోడల్ అధికారి షేక్‌సలాం తనిఖీ చేశారు.



ఆన్‌లైన్‌లో ప్రశ్నా పత్రం

ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో పాటు ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఈ మార్కులు థియరి పరీక్షల ఫలితాల తర్వాత యాడ్ అవుతాయి కాబట్టి విద్యార్థులు వైవాతో పాటు ప్రయోగాలను చేసి చూపుతునే ఎక్కువ మార్కులు వచ్చే అవకాశాలు ఉంటాయి. అయితే ఈ పరీక్షలకు గంట ముందే విద్యార్థులు పరీక్షలు చేరుకోవాల్సి ఉండగా పరీక్షలు పారదర్శకంగా జరిగేలా అర గంట ముందే ప్రశ్న పత్రాన్ని ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నా రు. పరీక్ష కేంద్రంలో ఎగ్జామినర్ సెల్‌ఫోన్ కు వచ్చే ఓటీపీ ఆధారంగా ప్రశ్నా పత్రాన్ని ప్రింట్ తీసే వెసులుబాటు లభిస్తోంది. కాగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు జరుగనున్నాయి.

తనిఖీలకు బృందాలు

జనరల్, ఒకేషనల్ విభాగాల విద్యార్థులకు మూడు విడతలుగా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. వీటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని సైతం నియమించారు. ఒక్కో బృందంలో ఒక అధ్యాపకుడు ఉంటారు. అలాగే డీఈసీ కమిటీ సభ్యులుగా ఒక ప్రిన్సిపాల్, ఒక లెక్చరర్ వ్యవహరించనున్నారు.



స్వామి వారి దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి

మాచారెడ్డి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కాపూర్ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానంలో పుట్టు వెంట్రుకలు, ఓడి బియ్యాలు, వాహనపూజలు, గండ దీపాలు, మొక్కుబడులు, వివాహ కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూలైన్‌లో సుమారు గంటన్నరసేపు వేచి ఉండాల్సి వచ్చింది. చుట్టు పక్కల జిల్లాలతో పాటు మండలాల నుంచి పెద్దఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు అయ్యప్ప స్వామి
ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలోని గోపాల్‌పేట్‌లో సోమవారం అయ్యప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి నూతన ఆలయాన్ని నిర్మించనున్నారు. ఈ ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌లతో పాటు వివిధ పార్టీల రాజకీయ ప్రముఖ నాయకులు, ప్రముఖులు పాల్గొననున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. స్థానిక మండల ప్రజలు సకాలంలో విచ్చేసి శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



ఆగం చేస్తున్న బీపీ, షుగర్

- జిల్లాలో వేలాది మందిని పట్టి పీడిస్తున్న రక్తపోటు, మధుమేహం
- వైద్య ఆరోగ్యశాఖ నివేదిక ప్రకారం 1,00,427 మంది రక్తపోటు, 62,550 మంది బాధితులు
- బాధితుల్లో యువకులే అధికం
- సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో వేలాది మందిని బీపీ, షుగర్ సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్ (ఎన్‌సీడీ) సర్వేలో ఈ విషయాలు వెలుగు చూడగా వారికి మందులను అందిస్తున్నారు. రక్తపోటుతో బాధపడుతున్న వారిలో ఎక్కువ శాతం మంది 30ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వారే కావడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో 1,00,427 మంది రక్తపోటు బాధితులు ఉన్నారు. వీరి ఆరోగ్య పరిస్థితి పలు సందర్భాల్లో ఇబ్బందికరంగా మారుతుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా గుండె సంబంధిత వ్యాధుల భారిన పడటంతో పాటు ప్రాణాంతకంగా మారవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డయాబెటిస్ (షుగర్)తోను అనేక మంది అవస్థలు పడుతున్నట్లు సర్వేలో తేలగా వారికి మందులు అందిస్తున్నారు. జిల్లాలో 62,550 మంది బాధితులు ఉన్నట్లు అధికారుల నివేదిక ద్వారా తెలుస్తోంది. చాలా మంది తమకు షుగర్ ఉందనే విషయాన్ని బయటకు చెప్పడం లేదని వైద్యులు చెబుతున్నారు. టెస్టుల కోసం వెళితే ఇతరులకు తెలుస్తుందనే భయంతోనూ పరీక్షలు చేయించుకోవడంలేదని పేర్కొంటున్నారు.

1,00,427 మంది రక్తపోటు బాధితులు

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేపట్టిన సర్వే ప్రకారం మొత్తం 1,00,427 మంది రక్తపోటును ఎదుర్కొంటున్నట్లు తేలింది. వీరిలోను పట్టణ ప్రాంతాలకు చెందిన వారే అధికంగా ఉన్నా రు. కంప్యూటర్ సంబంధిత ఉద్యోగాలు చేసే వారితో పాటు, ప్రైవేట్ ఉద్యోగులు, ఉద్యోగాల వేటలో ఉం టూ ఒత్తిడికి లోనవుతున్న వారితో పాటు, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటివి వ్యాధి కి కారణమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో యాభై ఏళ్ల పైబడిన వారు ఎక్కువగా బీపీతో బాధపడుతున్నట్లు తేలింది. వీరందరిని గుర్తించిన వైద్య ఆరోగ్యశాఖ ప్రతీ నెల మందులను పంపిణీ చేస్తోంది.

62,550 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు

జిల్లాలో 62,550 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యాధి భారిన పడ్డ వారిలో యువత కూడా ఉండటం ఆందోళన కలిగిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. డయాబెటిస్ వ్యాధి జీవనశైలిపై ఆధారపడి ఉంటుందనిపేర్కొంటున్నారు. వంశపారంపర్యంగా లేదా మానసిక ఒత్తిడి, జంక్‌ఫుడ్ తీసుకోవడం, సరైన వ్యాయామం లేకపోవడం, పొగాకు, మద్యం వంటి వ్యసనాలతో పాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను మార్చుకోకపోవడం వంటివి షుగర్ వ్యాప్తికి కారణాలుగా తెలుస్తోంది. పట్టణ వాసులతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజల్లోనూ షుగర్ రోగులు ఉన్నట్లు సర్వేలో తెలుస్తోంది. ప్రస్తుతం వీరందరికి ప్రభుత్వం మందులు అందిస్తోంది.

ఫటా..ఫట్...

'పది' విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు

● నిజాంసాగర్ మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి



ప్రభుత్వం పదోతరగతిలో విద్యాభ్యాసం చేసేబాలబాలికలకు సాయంత్రం వేళ నిర్వహించే ప్రత్యేక తరగతులకు బాల బాలికలకుఅల్పాహారాన్ని అందిస్తున్నాం. వంద ఉత్తీర్ణత శాతంలో భాగంగా ప్రతీ ఒక్కస్కూల్‌లో గ్రేడింగ్ రావడానికి కృషి చేస్తామని మండల విద్యాశాఖ అధి కారి తిరుపతిరెడ్డి ఆంధ్రజ్యోతితో తెలిపారు.

ఆంధ్రజ్యోతి:నిజాంసాగర్ మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి.ఎంత మంది బాల బాలికలు ఏఏ తరగతి నుంచి విద్యా భ్యాసం చేస్తున్నారు?

విద్యాధికారి:మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు కస్తూర్బా, ఆదర్శ పాఠశాల టీఎస్‌డబ్ల్యూ, ఆర్‌ఎస్ పాఠశాలను 25 కొనసాగుతున్నాయని, 3,172 మంది విద్యార్థి విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు.

ఆంధ్రజ్యోతి:మండలంలో ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారని ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

విద్యాధికారి:ఉపాధ్యాయుల పోస్టులగాను 84 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని 16 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి:మండలంలో ఎన్నిఉన్నత పాఠశాలలు ఉన్నాయి.ఈ పాఠశాలల్లో ఇంగ్లీష్ తెలుగు మీడియంలో ఎంత మంది విద్యార్థి విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

విద్యాధికారి:మండలంలోఉన్నతపాఠశాలలో మూడు ప్రభుత్వ పాఠశాల ఒకటి, ఆదర్శ పాఠశాల ఒకటి, కస్తూర్బా వి ద్యాలయం ఒకటి, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో 219 మంది తెలుగు మీడియంలో ఒక వంద ఇరవైఒక్క మంది విద్యాభ్యాసం చేస్తున్నారని, ఈపాఠ శాలల్లో పదోతరగతిలో మొత్తం 340 మంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి:ఏడాది పదోతరగతి పరీక్షలు ఎప్పటినుంచి నిర్వహిస్తున్నారు.మండలంలో ఎన్నిపరీక్ష కేంద్రాలలో నిర్వహి స్తారు.

విద్యాధికారి:ఏడాది పదోతరగతి పరీక్షలు మార్చి 21వ తేది నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు అయింది. మండలంలో ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీ టీఎస్ ఆర్‌డబ్ల్యూఎస్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు 21 నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు నిర్వహిస్తాం. ఆదర్శ పాఠశాలను విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు ఒకేషనల్ కోర్సు ఉన్నందున వారికి ఏప్రిల్ 4వ తేది వరకు పరీక్షలు నిర్వహిస్తాం.

ఆంధ్రజ్యోతి: పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

విద్యాధికారి:పదోతరగతిలో విద్యాభ్యాసం చేసే విద్యార్థి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అక్టోబర్ 2024 నుంచి డిసెంబర్ 31 వరకు ఉదయం 8గంటల15నిమిషాల నుంచి తొమ్మిది గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి:బడిబాట కార్యక్రమం ఎప్పటి నుంచి నిర్వహిస్తారు? ఈ కార్యక్రమంలో ఎంత మంది బడి మాని వేసిన విద్యార్థులను గుర్తించారు?

విద్యాశాఖాధికారి:బడిబాట కార్యక్రమాన్ని జనవరిఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు.

ఆంధ్రజ్యోతి:ఈవిద్యా సంవత్సరం విద్యాభివృద్ధికి ఎలాంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు?

విద్యాశాఖాధికారి: ఏడాది విద్యా సంవత్సరంలో ఎఫ్‌ఎల్‌ఎన్ లిప్ కిందట కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేసే 5వ తరగతి వరకు విద్యాభ్యాసం చేసే విద్యార్థిని విద్యార్థులకు ఎఫ్‌ఎల్‌ఎన్ ద్వారా 6, 7, 8, 9 తరగతిలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు లీప్ ద్వారా బేస్ లైన్ పరీక్షలు రాయించి విద్యార్థులు ఏ గ్రేడ్ స్థాయిలో ఉన్నారని గుర్తిస్తాం. గత డిసెంబర్ నెలలో మిడ్ లైన్ మార్చి నెలలో ఎండ్ లైన్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల పురోగతిపైన ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం.

● (ఆంధ్రజ్యోతి,నిజాంసాగర్)

ముదిరాజ్‌ల హక్కుల కోసం అందరూ ఐక్యంగా ఉండాలి



పోతంగల్‌లో సమావేశమైన ముదిరాజ్‌లు

కోటగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల హక్కుల సాధనకు అందరూ ఐక్యంగా ఉండాలని జిల్లా ముదిరాజ్ నాయకులు రమేష్ పేర్కొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో ఆదివారం ముదిరాజ్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మండల కమిటీతో పాటు గ్రామాల వారీగా అడహక్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముదిరాజ్‌లు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ప్రభుత్వం అందించే అవశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ నెల చివరి వారంలో మండల కమిటీని ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు కిరణ్, గంగాధర్, శంకర్, ఉత్తం పాల్గొన్నారు.

గ్రామ చావిడిలో మండల పరిషత్ ఏర్పాటు

కోటగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలం నుంచి కొత్తగా ఏర్పడిన పోతంగల్ మండలంలో మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోతంగల్ మండల కేంద్రంలో గ్రామ చావిడి భవనాన్ని మండల పరిషత్ కార్యాలయంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు గ్రామ చావిడిలో తపాలశాఖ కార్యాలయం కొనసాగించారు. మండల పరిషత్ భవనం కోసం తపాలశాఖ కార్యాలయాన్ని ఇతర భవనంలోకి మార్చారు. గ్రామ చావిడిలో రంగులు వేయిస్తూ మరమ్మతులు చేపడుతున్నారు. మంగళవారం పూర్తి స్థాయిలో భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కోటగిరి ఎంపీఓగా కొనసాగుతున్న చందర్ నాయక్‌ను పోతంగల్ ఎంపీడీఓగా నియమించారు. ఇప్పటికే ఆయన బాధ్యతలు స్వీకరించారు. కొత్త ఎంపీడీఓ భవనం వినియోగంలోకి వచ్చిన వెంటనే ఆయా సిబ్బందిని త్వరలో భర్తీ చేయనున్నారు.

నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఎడపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రంలోని నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం గ్రామ పెద్దలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న నల్ల పోచమ్మ ఆలయ స్థానంలో నూతన ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోల మల్కారెడ్డి, జనగం మోహన్ రెడ్డి, ఎల్లయ్య యాదవ్, రజిత యాదవ్, బంజ కామప్ప, బొబ్బిలి శ్రీనివాస్, ఆత్మేల శ్రీనివాస్, ఆనంద్ రెడ్డి, గెంటె పెద్ద మల్కన్న, కట్కం సుధాకర్, తూట్కూర్ రవీంధర్ రెడ్డి గ్రామ పురోహితులు మహేష్ జోషి రులు ఉన్నారు.



భూమిపూజ చేస్తున్న గ్రామ పెద్దలు

ఘనంగా వసంత పంచమి



శాస్త్రీనగర్‌లో అంకరించిన సరస్వతీదేవి



చిట్టాపూర్ ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

రుద్రూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో ఆదివారం సరస్వతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వసంత పంచమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయపూజారి రాజేశ్వర్ అప్ప, అక్కపల్లి నాగేందర్,అనిల్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, చిన్నారులు తదతరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వసంతి పంచమితో పాటు ఆలయ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అయ్యప్ప స్వామి ఆలయంలో గణపతి పూజ, హోమం, పుణ్యవచనము, 108కలశాలతో స్వామివారికి అభిషేకం, మహ హారతి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ముప్కాల్: వసంత పంచమిని పురస్కరించుకొని మండలంలోని పలు ఆలయాల్లో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.ఆదివారంమండలంలోని చిట్టాపూర్‌లోని సాయిబాబా ఆలయంలో యజ్ఞం నిర్వహించారు. నేడు వసంత పంచమి పురస్కరిం చుకొని సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అభిషేకం, కుంకుమార్చన,అనంతరం అన్నదానం నిర్వహిస్తారు. ఆలయంలో రథోత్సవం జరుగుతుం దని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలోభక్తులు పాల్గొని స్వామివారి కృపాకు పాత్రులు కావాలని వారు కోరారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ముప్కాల్ మండలంలోని వేంపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం,నల్లూర్‌లడ్డుబాలాజీఆలయంలోబాల్కొండ మండలం బోదేపల్లి సాయిబాబా ఆలయాల్లో వసంతిపంచమి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని శాస్త్రీనగర్ శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయంలో సోమవారంవసంతిపంచమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 5.30గంటలకు పంచామృతలతో అమ్మవారికి అభిషేకం, అలంక రణ, దర్శనం 8.30 నుంచి 10గంటల వరకు అక్షర భ్యాసం, 10నుంచి 12గంటల వరకు నవగ్రహ కలశ స్థాపన, సరస్వతి హోమం, సాయంత్రం 6 గంటలకు పల్లకీసేవ,ఊరేగింపు నిర్వహించి అనం తరం సత్యనారాయణ వ్రతం జరిపి అన్నప్రసాద వితరణ నిర్వహిస్తు న్నట్టు ఆలయ కమిటీ సభ్యు లు తెలిపారు. భక్తులు పాల్గొనాలని వారు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ



ఎడపల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవీపేట,ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్షల డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆకారం రమేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో సంబంధిత కార్యక్రమానికి చెందిన పోస్టర్లనుఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, జీవన్, కిషన్, రాములు, రవి, అశోక్,శంకర్ తదితరులున్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం లక్ష డప్పులు వేల గొంతుకలు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లసింగారి భూమయ్య ఆధ్వర్యంలో ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. మందకృష్ణ మాదిగ ఫిబ్రవరి 7న తలపెట్టిన కారల్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాదిగల ఐక్యతను చాటుకుని లక్ష డప్పులు వేల గొంతుకల కార్యక్రమానికి ప్రతీ కుటుంబం నుంచి మాదిగ సోదరులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహిళా సంఘం జాతీయ నాయకురాలు యమునా, జిల్లా నాయకురాలు సుధ, సావిత్రి, ఒడ్డిగారి గంగామణి, పిల్లంగోయిల రమేష్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

రుద్రూర్: ఎస్సీ వర్గీకరణ అమలుకై తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాదిగలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ నాయకులు పోచిరాం కోరారు. రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణం వద్ద ఆదివారం ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఉషం సాయికుమార్ ఆధ్వర్యంలో లక్ష డప్పులు, వేల గొంతుకల కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శన ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రామసాని సాయిరాం, కార్యదర్శి బుడ్డొల్ల నాగేష్, సంజీవ్, రవి, గంగాధర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహింప తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమానికి వేలాది సంఖ్యలో మాదిగలు డప్పులతో తరలివచ్చి విజయవంతం చేయాలని కమ్మర్‌పల్లి ఎమ్మార్పీఎస్ మండల శాఖ పిలుపునిచ్చింది. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కమ్మర్‌పల్లి మండల శాఖ అధ్యక్షుడు పాలెపు కిషోర్, కోశాధికార్శి పోడేటి ధర్మ య్య, పత్రి శ్రావన్, మైలారం రాజేందర్, కుంటికంటి నరేందర్, మైలారం బాలు, మారుతి, మహేష్, క్రాంతి, బాలయ్య. గంగాధర్, మాజీ ఎంపీటీసీ మైలారం సుధాకర్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం వేల గొంతులు లక్ష డప్పుల గోడప్రతుల ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆవిష్కరిం చారు. ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి ఎంఆర్‌పీఎస్ నాయకులు, మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయ ంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌చార్జీ కనక శ్రీదీప్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంకేపల్లి రాములు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వరుణ్, నాయకులు నట్ట బావన్న, నట్ట తిరుపతి, భూమేష్,ఎమ్మార్పీఎస్ మండలఉపాధ్యక్షుడు సుమన్, మండల ప్రధానకార్యదర్శి దినేష్, సునీల్, సతీష్, అబ్బాయ్య. రాజేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో ఘనంగా జగదాంబ మాత రథోత్సవం

● పాల్గొన్న ముత్యాల సునీల్ కుమార్ పెద్దోళ్ల గంగారెడ్డి



అమ్మవారి ఆలయంవద్ద రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామ శివారులో కొలువుదీరిన మాతా జగదాంబా (శుక్రవారం దేవి) ఆలయంలో వసంత పంచమిని పురష్కరించుకొని ఆదివారం జాతరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎన్నారై పోలీస్ విద్యాసాగర్ లావణ్య దంపతులు, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జాతర ఉత్సవాలు నిర్వహించారు. రోజువారి కార్యక్రమాలను అలయ అర్చకులు మంత్ర రాజ్యం మురళి, కృష్ణ పంతులు, ఆధ్వర్యంలో జరిగాయి. ఆదివారం వసంత పంచమి పర్వదినాన్ని పురష్కరించుకొని అలయంవద్ద జాతరా ఉత్సవాలు ఘనంగ జరిగాయి. మాఘశుద్ధపంచమి (వసంత పంచమి) ఉదయం అమ్మవారికి అభిషేకం ,విశేష అలంకరణ, ప్రత్యేకపూజ,హారతి, మంత్రపుష్పం, సుహాసినులతో అమ్మవారి సహస్ర నామ సామూహిక కుంకుమార్చన చండీ యాగం. సాయంత్రం రథహోమం, రథబలి, రథ ప్రతిష్ట, రథోత్సవం రాత్రికి అమ్మవారి డోలోత్సవం కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బగా అమ్మవారికి ఎన్నారై పోలీస్ విద్యాసాగర్ లావణ్య దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. సాయంత్రం అమ్మవారి రథోత్సవ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రథోత్సవ సందర్భంగా రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. జాతరా సందర్భంగా నిర్వహించిన నవ చండీయాగం, రథోత్సవంలో కార్యక్రమంలో బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్, బీజేపీ నాయకులు పెద్దల్ల గంగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, ఎన్నారై పోలీస్ విద్యాసాగర్ లావణ్య దంపతులతో పాటు కుటుంబ సభ్యులు, మారంపల్లి అశోక్, కమిటి సభ్యులు, నర్ర ముత్తన్న, శ్రీరాముల మురళి, సత్యానంద్, సామెర సుమన్, బైకిని మహేష్, ఏనుగు గంగారెడ్డి, వెన్నెల దేవేందర్, దేవి దీక్షాపరులు, పెద్ద సంఖ్యలో వివిద గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు, మహిళలు, గ్రామస్థులు వివిధ పార్టీ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

పడకల్‌లో ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండంలోని పడకల్ గ్రామంలో ఆదివారం శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం, జాతర, తృతీయ వార్షికోత్సవ ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. స్వామివారి రథోత్సవాన్ని అంగరంగా వైభవంగా కన్నుల పండగగా జరుపుకున్నారు. రథోత్సవాన్ని భక్తులు లాగి మొక్కులను తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నారాయణపేట్‌లో..

మండలంలోని నారాయణపేట్ గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయం జాతర, రథోత్సవం సందర్భంగా గ్రామస్థులు, భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట వీడీసీసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బినోల మహలక్ష్మీ ఆలయంలో చోరీ

నవీపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలలోని మహలక్ష్మి ఆలయంలో శనివారంరాత్రి దొంగతనం జరిగిందని ఎస్‌ఐ వినయ్ తెలిపారు.ఇద్దరు దొంగలు రాత్రి సమయంలో ఆలయం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారని అన్నారు. ఆలయం లోపల ఉన్న హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న సుమారు వెయ్యి రూపాయలకు పైగా నగదును ఎత్తుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామస్థుడు అయిటి దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్రి గ్రామంలో చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చత్రపతి శివాజీ అడుగుజాడల్లో నడవాలని ఆయన చేసిన సేవలను మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోదిరె స్వామి, జె.నర్సయ్య, అనంత్‌రావు, చెప్పాల గణేష్, మల్లెల లక్ష్మణ్, రంజిత్, రమేష్, రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ నారాయణరెడ్డికి గ్రామస్థుల నివాళులు



నారాయణరెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి2 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సుంకెట్ గ్రామంలో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమాలు చేపట్టిన పండిత్ నారాయణరెడ్డి ఐదో వర్ధంతి సంద ర్భంగా గ్రామస్థులు, నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం ఆయన విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ కోసం హైకోర్టు న్యాయవాదుల సంఘం ఏర్పాటు చేశారని, తెలంగాణరాష్ట్ర సాధనలో ఆయన పోరాటం మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ చిరంజీవి, మాజీ సర్పంచ్ నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలకు లిటిల్ ప్లవర్ విద్యార్థి ఎంపిక

మెండోర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలకు వెల్కటూర్ లిటిల్ ప్లవర్ హైస్కూల్ విద్యార్థి మనిదీప్ ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ అజ్మత్‌పాషా తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రాయి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి మనిదీప్ జాతీయస్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. అనంతరం ఎంపికైన మనిదీప్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ మత్స్యసహకార సంఘ సమావేశం

వేల్పూర్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో మహిళ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సమావేశం నిర్వహించారు. గ్రామంలో చెరువులోని చేపలు మహిళ సభ్యులు అందరు కలిసి మార్కెట్ వద్ద చేపలు అమ్ముకోవడం జరిగిందన్నారు. మహిళలు ప్రభుత్వ పరంగా పలు వ్యాపారాలను ఉపయోగించుకొని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘం అధ్యక్షురాలు ఎల్లుల నవ్య, ఉపాధ్యక్షురాలు ఎల్లుల మనస్వీని, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో అవినీతిపై కదలిక



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో గతంలో జరిగిన అవినీతిపై కదలిక మొదలైందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నట్టు తెలిసింది. గతంలో బీజేపీ ఫ్లోర్‌లీడర్ జీవీ.నర్సింహరెడ్డి మున్సిపల్‌లో జరిగిన అక్రమ ఇంటి నెంబర్‌ల కేటాయింపు, అక్రమ లేఅవుట్‌ల, వాహనాల కొనుగోలులో జరిగిన అవినీతిపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి పెర్కిట్‌లోని ఓ భవంతికి మున్సిపల్ చట్టాలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు చేయగా శనివారం ప్రాంతీయ సంచాలకులు షహీద్‌మసూద్ విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా పెర్కిట్‌లోని భవంతిని పరిశీలించి అక్రమ ఇంటి నెంబర్‌ల కేటాయింపులో అప్పటి రెవెన్యూ అధికారి అయ్యుం పాత్రపై విచారించినట్టు తెలిసింది. గత నెల 17న సీఎం కార్యాలయం నుంచి ఆర్మూర్ మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని అదనపు కలెక్టర్ అంకిత్‌కు ఆదేశాలు వచ్చాయి. రానున్న కాలంలో మున్సిపల్‌లో జరిగిన అక్రమాలను వెలికితీసి అధికారులపై చర్యలు తీసుకుంటారో లేదో అని ప్రజలు చర్చమొదలైంది.

ట్రస్మా అడ్‌హక్ కమిటీ నూతన కార్యవర్గం



అడ్‌హక్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న పాఠశాలల కరస్పాండెంట్‌లు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్‌లో ఆదివారం ట్రస్మ (తెలంగాణ రీకగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) నూతన అడ్‌హక్ కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా క్రాంతి, సభ్యులుగా శశీధర్‌రావు, రామకృష్ణ, గంగారెడ్డిలను ఎన్నుకున్నట్టు ఈసీ మెంబర్ పోలపల్లి సుందర్ తెలిపారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, కారయదర్శి రమేష్ రావు, కోశాధికారి రాఘ వేందర్‌రెడ్డి పర్యవేక్షణలో అడ్‌హక్ కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ అధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి ప్రవీన్ పవర్, వేణు, కాంతి గంగారెడ్డి, మానస గణేష్, గణేష్, అజిజుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బండారి యాదగిరి హైదరాబాద్‌లో భానుప్రకాష్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సంద ర్భంగా దేవాలయాలకు రాతి, పంచలోహ విగ్రహాలు నూతన ఆలయాల నిర్మాణానికి సహకారం అందించాలని కోరగా సానుకూలంగా స్పందించి ఆలయ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాయన్న, శ్రీరాం, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు చలి బోనాలు



ముప్కాల్‌లో గ్రామ దేవతలకు చలిబోనాలు సమర్పిస్తున్న మహిళలు

ముప్కాల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్, బాల్కొండ మండలాల్లో మహిళలు గ్రామదేవతలకు చలిబోనాలు సమర్పించారు. అమావాస్య పురస్కరిం చుకొని తొలి ఆదివారం రోజు గ్రామంలోని కుండలో రాత్రి వండిన బోనాలను మహిళలు ఎత్తుకొని ఆలయాలకు తీసుకువచ్చి గ్రామదేవతలకు సమర్పించారు.

ఘనంగా బీరప్ప ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



నిజాంపూర్‌లో బీరప్ప ఆలయంలో ప్రతిష్ఠాపన నిర్వహించిన దృశ్యం

నవీపేట,ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజాంపూర్‌లో సుమారు 70లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుర్మ సంఘం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన ఆదివారం స్థాపిత దేవత పూజ, హోమం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, పంచామృత అభిషేకం, అలంకరణ, బలిహరణము, శేష హోమం, మహ పూర్ణాహుతి, ఆశీర్వాచనము, హారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, బంగి గంగారాం, పుల్ల గంగాధర్, పోతన్న, మల్లన్న, దేవన్న, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. శనివారం రాత్రి సంఘ సభ్యులు పోచంపాడ్ గోదావరికి చేరుకొని వేకువ జమున గంగస్నానం ఆచరించి పట్టణ శివారులోకి గంగజలాలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్వసమాజ్ ప్రతినిధులు, సంఘ సభ్యులు డప్పు వాయిద్యాలతో గంగజలాలను తీసుకువెళ్లి పట్టణంలో గ్రామదేవతలకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సలిబోనాలను గ్రామ దేవతలకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి కార్యదర్శి కర్తన్ దినేష్, చేపూర్ ధనుంజయ్, లాకక్కుల రంజిత్, దొండి శ్యామ్, చక్రి, నర్మే గంగారెడ్డి, భూమన్న, సదర్‌లు గుండెటి మహేష్, చిట్టి శ్రీనివాస్, బి.రాజు, సుద్దపురం లింగన్న, దొడ్ల గోపాల్, నల్ల లింగన్న, సంఘ పెద్దమనుషులు, తదితరులు పాల్గొన్నారు.



గోదావరి గంగజలాలను తీసుకువచ్చిన సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి సభ్యులు

లక్షల జీతం వద్దు వ్యవసాయమే ముద్దు

» సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతు దంపతులు
» ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తే మరింత దిగుబడులు సాధించవచ్చని అంటున్న యువ రైతులు

ఆదర్శం


జలాల్‌పూర్‌లో పందిరి విధానంలో సాగు చేస్తున్న బీర పంట

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వారిద్దరు విద్యావంతులే. కొన్నేళ్ల పాటు దుబాయిలోని ఓ ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగాలు చేశారు. లక్షల్లో జీతం ఉన్నా ఏదో తెలియని వెలితి. సొంత ఊరిలో వ్యవసాయానికి సాటి లేదని భావించి ఉద్యోగాన్ని వదిలి స్వగ్రామానికి చేరుకొని వ్యవసాయం చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన కత్తి అజయ్ సంధ్యారాణి దంపతులు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేసిన వ్యవసాయంపై మక్కువతో స్వగ్రామంలో తమకు ఉన్న మూడు ఎకరాల్లో సేంద్రీయ పద్ధతుల్లో వివిధ కూరగాయల పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

పందిరి పంటల సాగు

పందిరి పంటల సాగు విధానంలో టమాట, సొరకాయ, కీరదోస, బీర, కాకర వంటి కూరగాయల పంటలతో పాటు వంకాయ, బెండకాయ పంటలు సాగు చేస్తున్నారు. తాము పండించిన పంటలను రిలయన్స్ మాల్‌లో ఒప్పందం కుదుర్చుకొని నేరుగా వారికి సరఫరా చేస్తున్నారు అంతే గాకుండా కొన్ని సార్లు అంకాపూర్, ఆర్మూర్ మార్కెట్‌లలో విక్రయిస్తున్నారు. దళారుల వ్యవస్థలో ప్రజలకు, రైతులకు నష్టం కలుగుతుందని భావించిన వీరు అధిక శాతం కూరగాయలను నేరుగా ప్రజలకే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. కూరగాయల పంటలను మాల్చింగ్, స్టేకింగ్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు డ్రిప్ మినహా ఎలాంటి సౌకర్యం, సబ్సిడీ లభించలేదని రైతు అజయ్ తెలిపారు.


స్టేకింగ్ విధానంలో సాగు చేస్తున్న టమాట పంట


మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన కాకరకాయలు


వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న కీరదోస

మద్దతు ధర లభిస్తే లాభాల పంట

ఎండనక, వాననక కష్టపడుతున్న రైతులకు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర పలికినప్పుడు లాభాలు దక్కుతాయి. టమాట ఎకరం విస్తీర్ణంలో సాగుకు సుమారు రూ.80వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఈ సారి టమాటకు ధర లభించడంతో సుమారు రూ.3 లక్షల 60వేలు ఆదాయం వచ్చింది. అదే విధంగా ఆరు గుంటల విస్తీర్ణంలో సొరకాయ పంట సాగు చేస్తే సుమారు రూ.లక్ష 60వేల ఆదాయం లభించిదని వారు తెలిపారు. కూరగాయల ధరలు ఒక్కోసారి ఒడి దుడుకులకు లోనవుతాయి. అలాంటి పరిస్థితుల్లో పూర్తిగా నష్ట పోవాల్సి వస్తుంది. టమాటబాక్సు (25కేజీ) రూ.800 వచ్చిన సందర్భాలున్నాయి. ధర పతనమైనప్పుడు టమాటలను చెట్లపై వదిలేసిన సంఘటనలు ఉంటాయి. ప్రభుత్వం కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు సబ్సిడీ అందజేస్తే రైతులకు మేలు జరగడమే గాకుండా ఇతర రైతులు కూడా ఎంతో కొంత విస్తీ ర్ణంలో కూరగాయల పంట సాగు వైపు మొగ్గు చూపుతారు. అదే విధంగా కూరగాయలు సాగు చేపడుతున్న రైతులకు ప్రభుత్వం గతంలో అర ఎకరం యూనిట్ సాగుకు రూ.50వేలు సబ్సిడీ ఇచ్చేది. పూర్తి సబ్సిడీపై విత్తనాలు, పంట నార్లు అందజేసేవారు. కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ అందజేస్తే రైతులు కూరగాయల సాగువైపు దృష్టిసారిస్తారు.


మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా టమాటాలు

సేంద్రియ పంటలకు డిమాండ్ ఉంది

● కత్తి అజయ్, రైతు, జలాల్‌పూర్

సేంద్రియ పంటలకు, కూరగాయలకు డిమాండ్ ఉంది. ప్రతీఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధచూపుతున్న దృష్ట్యా ప్రజలు ఆదరిస్తున్నారు. ధర ఎక్కువ అయిన వీటిపై మక్కువ చూపిస్తున్నారు. ప్రస్తుతం సాగు చేసే మూడు ఎకరాలతోపాటు అదనంగా మరో నాలుగు ఎకరాల్లో సేంద్రియ పంటలను సాగుచేయాలని ఉంది. తాజా కూరగాయాలను ఆర్మూర్‌లో విక్రయించడానికి స్టాల్‌ను ప్రారంభించే ఆలోచనలో ఉన్నాం. దళారుల బెడద లేకుండా నేరుగా ఫాం నుంచి రైతులకే చేరవేస్తాం.



మరిన్ని పంటల సాగుకు ప్రయత్నిస్తున్నాం

● సంధ్యారాణి, రైతు జలాల్‌పూర్

తాను ఎంబీఏ ఫైనాన్షియల్ మార్కెటింగ్ చదివి దుబాయిలో ఉద్యోగంచేసి వ్యవసాయంపై మక్కువతో ఇక్కడికి వచ్చాం. సేంద్రియ వ్యవసాయం చేయడం సంతృప్తిగా ఉంది. భవిష్యత్‌లో హని, కాశ్మీర్, హనిబేరి, డ్రమ్ స్టిక్స్ అవకాడో, కర్రిలీఫ్ పంటలు సాగు చేయాలని ఉంది. మా మనసుకు నచ్చిన వ్యవసాయం చేయడంతో పాటు పది మందికి ఉపాధి లభించడం సంతోషంగా ఉంది.


కమ్మర్‌పల్లిలో చలి బోనాలతో ఊరేంపుగా వస్తున్న మహిళలు

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్లూర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అర్చకులు స్వామివారి కల్యాణం జరిపించారు. అంతకుముందు స్వామివారి ఎదర్కోలు, పుష్పాభిషేకం, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు బద్దం గణేష్, ఏనుగు గంగారెడ్డి, బద్దం మురళిరెడ్డి, బద్దం శ్రీనివాస్, మద్దం అనీల్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సాయంత్ర స్వామివారి పల్లకి ఊరేగింపు నిర్వహించారు.

గ్రామ దేవతలకు చలి బోనాలు, నైవేద్యాల సమర్పణ


కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలు

కమ్మర్ పల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మర్‌పల్లి నాగాపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో ఆదివారం ఆయా గ్రామాల భక్తజనం పోచమ్మ ఆలయాలకు పోటెత్తారు. గ్రామాలలోని పోచమ్మ ఆలయాలవద్ద బారులతీరి చలిబోనాలు సమర్పించుకున్నారు. పుష్యమాసం అమావాస్య తదుపరివచ్చే ఆదివారం పోచమ్మలకు బోనాలు సమర్పించుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారమని గ్రామస్థులు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహిళలు పెద్దసంఖ్యలో గ్రామ శివారుల్లో ఉన్న గ్రామదేవతలు పోచమ్మ, మైశమ్మ, ఐదుజేతుల పోచమ్మ, నల్లపోచమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో భక్తులు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య కుటుంబసభ్యులు గ్రామస్థులతో కలిసి బోనాలు, నైవేద్యం సమర్పించుకున్నారు.

నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్వహణకు నిధుల కరువు!

● వరద గేట్ల ఆయిలింగ్, గ్రీసింగ్ పనులకు రూ.10 లక్షలు కేటాయించి చేతులు దులుపుకుంటున్న పాలకులు

ఆంధ్రజ్యోతి ఫోకస్


నిజాంసాగర్ ప్రాజెక్టు ఇదే.


శిథిలమైన నిజాంసాగర్ కట్టపై భాగం


కట్టపైన గుంతలు పడ్డ దృశ్యం

నిజాంసాగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, పాలకులు మారినా నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్వహణకు నిధులు కేటాయించేవారు కరువయ్యారు. జిల్లా అధికారులూ నిధలు రాబట్టడంలో విఫలమవుతున్నారు. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్వహణకు అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. కేవలం నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఉన్న వరద గేట్ల గ్రీసింగ్ పనులకు ప్రతీ యేటా 10లక్షల రూపాయలు కేటాయిస్తున్నారు తప్ప నిర్వహణ కోసం ఎలాంటి నిధులు మంజూరు చేయడం లేదు. కాలక్రమేనా నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్వహణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనేచందంగా మారింది. నిజాంసాగర్ ప్రాజెక్టు కట్టపైన బీటల పడడమే కాకుండా కట్టపై భాగం గుంతలు పడుతున్నా నిధులు లేనిచో మరమ్మతులు చేపట్టలేకపోతున్నారు. నిజాంసాగర్ ప్రాచీన కట్టడాలను 2013లో 2021లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అప్పట్లో ప్రత్యేక నిధులతో మరమ్మతులు చేసిన నిర్వహణ కొరవడి అవి కళావిహీనంగానే మారాయి. కట్టకు అంతర్భాగంలో ముళ్ల పొదలు. కట్టకింది భాగాన వేపుగా వృక్షాలు పెరిగిన వాటిని తొలగించలేకపోతున్నారు. నిజాం ప్రభుత్వంలో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిర్మాణం చేశారు. ఇప్పటికీ ప్రాజెక్టు 104 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. కానీ అధికారులు పాలకులు నిజాంసాగర్‌పై నిర్లక్ష్యం వహించడంతో అవి కళాయినంగా మారుతున్నాయి. నిధులు లేక వీఐపీ అతిథిగృహ గార్డెన్ ఆనవాలు లేకుండా పోయింది. గోల్ బంగ్లాకు మరమ్మతులు చేసిన ఫలితం లేకపోయింది. గుల్షన్ బంగ్లా గార్డెన్‌ను పర్యాటకులకు కనువిందు చేసేందుకు మరమ్మతులు చేసిన గార్డెన్ పూర్వవైభవం రాలేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు తెలంగాణ జిల్లాల్లోని మొట్టమొదటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినా పాలకులు, ప్రభుత్వాలు నిజాంసాగర్ ప్రాజెక్టుపై నిర్లక్ష్యం వైఖరి అవలంబించడంతోనే ప్రాచీన కట్టడాలు కళావిహీనంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నిజాంసాగర్ కట్టకు ఇరువైపులా ఉన్న గోడలకు సిమెంటు పెచ్చులు ఊడిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు నిజాంసాగర్ నిర్వహణ కోసం నిధులు కేటాయించేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జర దేఖో!!


అర్గొండలో పనిచేయని సీసీ కెమెరా

గ్రామాల్లో పనిచేయని నిఘా నేత్రాలు

● ఏళ్లు గడుస్తున్నా కెమెరాలపై దృష్టిసారించని అధికారులు
● అర్గొండలో పూర్తిగా పాడైన కెమెరాలు

రాజంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో శాంతి భద్రత పరిరక్షణలో పోలీసులకు తోడుగా సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. నేరాలు జరిగిన గంటల వ్యవధిలోనే సీసీ కెమెరాలలో నిక్షిప్తమైన దృష్యాలతో పోలీసులు అనేక కేసుల దర్యాప్తును వెనువెంటనే పూర్తి చేసేస్తున్నారు. ఇలా అనేక కేసులను స్వల్ప కాలంలోనే ఛేదిస్తున్నారు. రాజంపేట మండలంలోని శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దొంగతనాలు, ఇతర విషయాలను ఎప్పటికప్పుడు కనిపెట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ఆయా గ్రామాలలో ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. అయితే గత రెండు సంవత్సరాలుగా సీసీకెమెరాలు పనిచేయకపోయిన వాటి మరమ్మతులు చేయించకపోవడంతో వృధాగా ఉంటున్నాయి. అర్గొండ గ్రామంలో ఒక స్వచ్ఛంద సంస్థ 24 కెమెరాలు బిగించిన వాటి చిన్న మరమ్మతులు చేయించకపోవడంతో సీసీ కెమెరాలు పూర్తిగా చెడిపోయాయి. కొన్నిరోజుల క్రితం అర్గొండ గ్రామంలో చైన్‌స్నాచింగ్ జరగడంతో కెమెరాలు పనిచేయక పోలీసులు కేసు ఛేదనలో కొద్దిగా ఇబ్బంది పడ్డారు.గ్రామం మూడు మండలాలకు ప్రధాన రహదారిగాఉండడంతో అక్కడ నిఘా నేత్రాలు పనిచేయకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు పోలీసుసిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆయా గ్రామాలలో చెడిపోయిన సీసీ కెమెరాలను బాగు చేయించుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు ముందుకు వస్తే నేరాల నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


అర్గొండలో పనిచేయని మరో సీసీ కెమెరా


తరగతి గోడపై ఇంగ్లీష్ అక్షరమాల


గోడపై తెలుగు అక్షరమాల

స్ఫూర్తి



టికారం తండా పాఠశాల భవనం

విద్యనేర్పుతూ.. జీవితాల్లో వెలుగులు నింపుతూ!

● కళాహీనంగా ఉన్న పాఠశాలకు కొత్త కళ తెచ్చిన ఉపాధ్యాయులు ● విద్యార్థులకు ఆకర్షిస్తున్న ప్రాథమిక పాఠశాల

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చదువు నేర్పాలన్న సంకల్పం ఉంటే ఎలాగైనా విద్యార్థులకు బోధన చేయవచ్చని నిరూపిస్తున్నారు మండలంలోని టికారాం తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత అక్టోబర్‌లో నూతనంగా డీఎస్సీ ద్వారా నియామకమై గిరిజన పాఠశాలలో చిన్నారులకు విద్యాబోధన చేసేతీరు తండా వాసులతోపాటు ఇతర గ్రామాల ప్రజలను ఆకట్టుకుంటుంది. కామారెడ్డి జిల్లాలో నూతనంగా ఏర్పాటయిన మండలాల్లో పెద్దకొడప్‌గల్ మండలం ఒకటి. ఈ మండలంలో మారుమూల ప్రాంతంలో చాలా గిరిజన తండాలు ఉన్నాయి. అటు వంటి గిరిజన తండాలో చిన్నారులకు విద్యాబోధన చేయాలన్న తలంపుతో ఈ పాఠశాలనే ఎంచుకుని వారి జీవితాలను వెలుగులు నింపుతున్నారు ఈ ఇద్దరూ ఉపాధ్యాయులు.. పెద్దకొడప్‌గల్ మండలం సీతారాం తండాకు చెందిన ప్రవీణ్‌తోపాటు, కామారెడ్డి ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్ గత అక్టోబర్‌లో ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా నియామకమయ్యారు. ఆనాటి నుంచి పాఠశాలలో చిన్నారులకు బోధనచేస్తూ ముందుకు సాగుతున్నారు ఈ యువఉపాధ్యాయులు.

నాడు 13 మంది.. నేడు 32 మంది విద్యార్థులు

జూన్‌లో టికారం తండా పాఠశాల ప్రారంభానికి విద్యార్థుల సంఖ్య 13గా ఉండేది. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 32కు చేరింది. గతంలో ఈ పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయులు ఉండటం, పాఠశాల అవసరాల దృష్ట్యా ఉపాధ్యాయులు ఎటైనా వెళితే పాఠశాల మూతపడేది. దీంతో తండావాసులు ఇక్కడ తమ పిల్లలకు సరైన విద్య లభించదేమోనన్న తలంపుతో ప్రైవేట్ పాఠశాలకు పంపారు. కొత్త ఉపాధ్యాయులు నియామకం కావడం వారు చిన్నారులకు విద్యను బోధించే తీరును పరిశీలించిన తండా వాసులు తిరిగి తమ పిల్లలను ప్రయివేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నారు. దీంతో ప్రసుత్తం పాఠశాలలో చిన్నారుల సంఖ్య 32 కు చేరింది.

సొంత నిధులతో పాఠశాలకు రంగుల చిత్రాలు

టికరాం తండా ప్రాథమిక పాఠశాలకు రెండు గదులు ఉండగా, అందులో ఒకటి శిథిలావస్థకు చేరింది. ఉన్న ఒక్క తరగతి గది అంతంగా మాత్రంగా ఉండటంతో ఇద్దరూ ఉపాధ్యాయులు తలో 15 వేలు మొత్తం రూ.30 వేలు జమ చేసుకుని చిన్నారుల ఊహలకు అనుగుణంగా పాఠశాల తరగతి గది గోడలపై రంగురంగుల చిత్రాలు వేయించారు. అందులో కొన్ని ఇంగ్లీష్‌కు సంబంధించిన వాటితోపాటు తెలుగు అక్షరమాల, కూరగాయలు, పండ్లు, దేశ నాయకులు ఫొటోలు, ఎక్కాలు తదితర వాటిని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో గీయించారు. గతంలో కళావిహీనంగా కనబడిన పాఠశాల గది నేడు విద్యార్థులకు ఆకర్షించే స్థాయికి చేరింది. ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రయివేట్ పాఠశాల మాదిరిగా విద్యార్థులతో ఉపాధ్యాయులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రదర్శించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఇకకొంత మంది చిన్నారులైతే ఇంగ్లీస్‌లో స్పీచ్ ఇవ్వడంతో తండా వాసులు ఫిదా అయ్యారు. ప్రైవేటుకు ధీటుగా విద్యాబోధన గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం తెలుగులో విద్యాబోధన చేస్తారనే నానుడిని పటాపంచలు చేస్తూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాద్యమంలో విద్యాబోధన చేస్తున్నారు.

తండాలో విద్యకు విలువెంతో!

● ప్రకాష్, ప్రధానోపాధ్యాయుడు, టికారం తండా పాఠశాల



నేను మారు మూల గిరిజన తండాకు చెందిన వ్యక్తినే. తండాలో విద్యకు ఎంతో విలువ ఉంటుందో నాకు తెలుసు. అందుకే డీఎస్సీ ఎంపిక సమయంలో తండా పాఠశాలనే ఎంచుకున్నారు. పాఠశాల చేరి విధులు నిర్వహించే సమయంలో పాఠశాలలో సౌకర్యాలు లేవని బాధపడకుండా సౌకర్యాలు కల్పించుకుంటూ విద్యా బోధన చేస్తున్నాం. మా కృషికి ఫలితంగా నేడు విద్యార్థుల సంఖ్య పెరిగిం ది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థుల సంఖ్య 50 వరకు పెంచాలని చూస్తున్నాం. పాఠశాల అభివృద్ధిలో తండావాసులతో పాటు, ఎంఈవో అందించే కృషి మరువలేము.

విద్యార్థులకు చక్కని విద్యను అందించాలనేదే లక్ష్యం

● నవీన్, ఉపాధ్యాయుడు టికారం తండా పాఠశాల



విద్యార్థులకు చక్కని విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలలో బోధన చేస్తున్నాం. చిన్నారులకు బోధన సరిగ్గా అందాలనే ఉద్దేశంతో పాటు, పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండాలన్న తలంపుతో మా ప్రధానోపాధ్యాయులు నేను కలిసి సొంతంగా పాఠశాలకు రంగులు వేయించాం. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాలు ఉంటారని నానుడిని నిజం చేస్తూ విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దాలని అను కుంటున్నాం.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

రేణుక ఎల్లమ్మ సంబరాలు ప్రారంభం

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో 28వ వార్షికోత్సవం సందర్భంగా సంబరాలను ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 5 వరకు సంబరాలు కొనసాగనున్నాయని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, ఫల పంచామృతాభిషేకం, గణపతి గౌరిపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణం, ప్రధాన కలశస్థాపన, అఖండ దీపారాధన, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ ప్రాణప్రతిష్ఠ



అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న సుభాష్‌రెడ్డి

సదాశివనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి మూల విరాట్ స్వర్శదర్శనం చేసుకున్నారు. వేదపండితుల సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకులు శాలువాతో సన్మానించి దీవించారు. ఆలయ నిర్మాణంలో భాగంగా తనవంతుగా రూ.2లక్షల 18వేల విరాళం అందించారు.

కురుమ యువ చైతన్య సమితి కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవున్‌పల్లి కురుమ యువ చైతన్య సమితి నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగుల్ల రాజయ్య, ఉపాధ్యక్షుడిగా ఒగ్గు నర్సింలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెట్కూరి రవి, ప్రధానకార్యదర్శిగా శ్రీశైలం, కార్యదర్శిగా మహిపాల్, కోశాధికారిగా గంగాధర్, ప్రచార కార్యదర్శిగా దొడ్లరమేష్, సలహాదారులుగా చిందంమల్లేష్, భాస్కర్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, జిల్లా లీగల్ అడ్వైజర్ గంగారాజం తదితరులు పాల్గొన్నారు.

వీడీసీ కమిటీ ఏర్పాటు

రాజంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామంలో ఆదివారం విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ(వీడీసీ)ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని కులసంఘాలు, గ్రామ పెద్దలు యువకుల సహకారంతో ఏర్పాటుచేయడం జరిగిందని, ఈ కమిటీ ముఖ్యఉద్దేశం గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను గ్రామపంచాయతీ పరిధిలో పెద్దల సహకారంతో తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందన్నారు.

నల్లమడుగు పెద్దతండాలో విగ్రహ ప్రతిష్ఠాపన

● పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సురేందర్



నల్లమడుగు పెద్దతండాలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే

లింగంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమడుగు పెద్దతండాలో ఆదివారం శ్రీ జగదాంబ, సేవాలాల్ మహారాజ్‌ల విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే సురేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన సురేందర్‌ను గిరిజనులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు గన్ను నాయక్, బన్ని నక్రు, రవీందర్ ఈశ్వర్‌లతో పాటు మండలంలోని వివిధ తండాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

పర్మల్లలో బెల్టు షాపు నిర్వహిస్తే జరిమానా



పర్మల్లలో బెల్టు దుకాణం నిషేదిస్తూ తీర్మానం చేసిన గ్రామస్థులు

లింగంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్మల్ల గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తే రూ.1లక్ష జరిమానా విధిస్తామని గ్రామస్థులు తీర్మానం చేశారు. గ్రామంలోని యువత తాగుడుకు బానిసలుగా మారి చదువుకు దూరం అవుతున్నారని అసాంఘిక కార్యక్రమాల వైపు ఆకర్షితులవుతున్నారని, జూదం ఆడుతూ ఇంటి సమస్యలు పట్టించుకోవడం లేదని, తాగిన మైకంలో గొడవలు పడుతున్నారని గ్రహించిన గ్రామస్థులు గ్రామంలో బెల్టు షాపు తొలగించడమే సమస్య కు పరిష్కారమని గ్రామస్థులంతా తీర్మానం చేసి గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ. లక్ష జరిమాన విధిస్తామని హెచ్చరించారు. సోమవారం నుంచి జరిమాన అమలులోకి వస్తుందని వారు తెలియజేశారు. తీర్మా న పత్రాన్ని ఎల్లారెడ్డిలోని ఎక్సైజ్ అధికారులకు అందజేశారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ బద్ద లక్ష్మయ్య, సాయకుమార్, ఈర్ల శ్రీనివాస్, గోపాల్‌ల తో పాటు గ్రామస్థులు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి సన్మానం

భిక్కనూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పురం రాజమౌళిని ఆదివారం చిన్ననాటి స్నేహితులు, నాయకులు సన్మానించారు. ఈ మేరకు శాలువతో సన్మానించి జ్ఞాపికను బహూ కరించారు. అనంరం వారు మాట్లాడుతూ రాజమౌళి మున్ముందు మరి న్ని పదవులు సాధించి, సేవా కార్యక్రమాలను సైతం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, స్నేహితులు పాల్గొన్నారు.



రాజమౌళిని సన్మానిస్తున్న దృశ్యం

ఉద్దెర గంగప్ప సేవలు అభినందనీయం

● ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో మాజీ సర్పంచ్ ఉద్దెర గంగప్ప స్మారకార్థంగా వారి మనవాళ్లు వుద్దెర ఆనంద్ కుమార్, వినయ్ కుమార్, రాజ్‌కుమార్ అర్జున్ మండల స్థాయి కబడ్డీ, గ్రామ స్థాయిలో వాలీ బాల్ టోర్నమెంట్ నిర్వంచారు. ఫిబ్రవరి 7 నుంచి రెండు రోజులు నిర్వహించిన టోర్నమెంట్‌లో ముఖ్య అతిథిగా ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు విచ్చేసి ఇరు జట్లు పరిచయం చేసుకొని ఆట ప్రారంభించారు. అనంతరం విన్నర్‌గా నిలిచిన తాడ్కోల్ జట్టుకు ఐదువేల రూపాయలు, రన్నర్‌గా నిలిచిన బాన్సువాడ జట్లుకు మూడు వేల రూపాయలు ట్రోఫీలు అందించి అభినందనలు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ కళావతి,



ఇబ్రహీంపేట్‌లో క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆగ్రోస్ చైర్మన్

హన్మాండ్లు యువజన నాయకులు రాజ్‌కుమార్, అర్జున్, పరమేశ్వర్‌లు జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం క్రీడలను దగ్గరుండి విజయవంతం చేసిన యువకులు వసీయొద్దీన్, తజమ్ముల్, ఘనీ, సతీష్, కొడార్ల అనిల్, బోయిని సంపత్, మల్లుగారి సాయిలును జ్ఞాపికలను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ మాజీ సర్పంచ్ గంగప్ప సేవలు చిరస్మరణీయమని సుదీర్ఘకాలం పాటు ఆయన గ్రామానికి సర్పంచ్ పనిచేసి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కాలంలో ఒకసారి పదవి చేస్తే మరోసారి చేసే అవకాశం దక్కడం చాలా కష్టమనీ అటువంటి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని గ్రామానికి సేవ చేసే నాయకులు చాలా అరుదుగా ఉంటారన్నారు. ఆయన స్వర్గస్తులైన వారి జ్ఞాపకాలను వారి మనవళ్లు అయన పేరిట ప్రతీ యేడు క్రీడలు నిర్వహించడం అభినందనీమన్నారు. వచ్చే సంవత్సరం మా వంతు సహకారం అందించి మరింత విజయవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మెన్ కృష్ణా రెడ్డి, నాయకులు ఖలేక్, ఏజాస్, సురేష్, రోహిత్, మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి, దేవరాం నారాయణ రెడ్డి, హన్మజి పెట్ సాయిలు, డైరెక్టర్ బండి సాయిలు, మద్దెల చెరువు సాయిలు పాల్గొన్నారు.

బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



ఇబ్రహీంపేట గ్రామంలో బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఆగ్రోస్ చైర్మన్

బాన్సువాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న మహాత్మ బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆది వారం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. వసంత పంచమి పురస్కరించుకొని స్థానిక లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించనున్న మహాత్మ బసవేశ్వర విగ్ర హ భూమి పూజ కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మ బస వేశ్వర చిత్రపటానికి పూలమాలవేసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో లింగసమాజ్ పెద్దలు మాజీ ఎంపీటీసీ హన్మండ్లు, దేగ్లోరి హన్మండ్లు, అర్‌వి అంజు, లింగం అప్ప, శివ కుమార్, దేగ్లుర్ శంకర్, లోలపు సంగప్ప, కల్లెట్టి శ్యామ్, దేవేందర్, పందిరి గంగాధర్, చిన్న లింగం, అర్జున్ పరమేశ్వర్, రవీందర్, జంబిగ శంకర్, లోలపు విజయ్, వినోద్, సురేష్ మనోజ్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి.. ఎంతో పవిత్రమైంది!

● పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి



ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తాడ్వాయి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని రాష్ట్ర పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి అన్నారు. ఈయన ఆదివారం మండలంలోని దేమి కలన్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ ఉద్యోగ విరమణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ఎన్నో అత్యున్నతమైన గొప్ప గొప్ప వారిని తయారు చేయడానికి ఉపాధ్యాయ వృత్తి కీలకం అని అన్నారు. ప్రతీ ఉద్యోగానికి ఉద్యోగ విరమణ సహజం అని అన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ తాను ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగినందుకు ఎంతో గర్వపడుతున్నానని తెలిపారు. పేద పిల్లలకు చదువు నేర్పి వారి అత్యున్నత స్థాయికి ఎదిగేలా కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని తెలిపారు. పేద విద్యార్థుల తల్లిదండ్రుల ఆశీర్వాదంతోనే తమ ఆరోగ్యంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షులు కుషాల్, టిపిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మనోహర్‌రావు, ఎంఈఓలు రామస్వామి, ఆనంద్ రావు, ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సంత్ సేవాలాల్ - జగదాంబా దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన కోసం విగ్రహాలను ఆలయంలోకి తీసుకెళుతున్న దృశ్యం



బీజేపీ నాయకుడు పైడి ఎల్లారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్గం చెరువు తండాలో శ్రీ జగదాంబ దేవి,శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బెజ్గం చెరువు గిరిజన తండాలో శుక్ర వారం వారం నుంచి ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మూడు రోజులపాటు ఘ నంగా జరిగాయి. మూడో రోజు ఆదివారం జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ మూర్తి విగ్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాలను భక్తు లు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, రాష్ట్ర బీజేపీ నాయకులు పైడి ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డితో పాటు వివిధ పార్టీల రాజకీయ నాయకులు, గిరిజన నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

● ఆలయ అభివృద్ధికి రూ. 50 వేల విరాళం

మండలంలోని బెజ్గం చెరువు తండాలో శ్రీ జగదాంబ దేవి, శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ అభివృద్ధికి రాష్ట్ర బీజెపి నాయకులు పైడి ఎల్లారెడ్డి యాభై వేల రూపాయలను విరాళం గా అందజేశారు. ఆదివారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్ర మానికి పైడి ఎల్లారెడ్డి హాజరై తనవంతుగా ఆలయ అభివృద్ధి కోసం విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు పైడి ఎల్లా రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమావత్ బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయండి



బాన్సువాడలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బాన్సువాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న హైదరాబాద్ మహానగరంలో ఎస్సీ వర్గీకరణ అమలు కొరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ సాంస్కృతిక ప్రదర్శన సభను విజయవంతం చేయాలని బాన్సువాడ ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో సన్నాహక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 7న ఉదయం 8 గంటల లోపు బాన్సువాడ అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని, అక్కడ అంబేద్కర్ చుట్టూ డప్పుల దరువు చేపట్టి, అంబేద్కర్ విగ్రహానికి దండ వేసి, అక్కడనుండి బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం వరకు డప్పుల దరువు, డీజే పాటలతో భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లేటట్లు ప్రణాళికను సిద్ధం చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల, గ్రామాల వాహనాలు, చేరుకొని ఇక్కడి నుంచి భారీ ర్యాలీ ప్రదర్శనతో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నట్లు వారు తెలిపారు. మాదిగ, మాదిగ జాతి ఉపకులాల పెద్దల సమక్షంలో ఐక్యమత్యంగా నిర్ణయం తీసుకోవడం జరిగింది. మాదిగ, మాదిగ జాతి ఉపకులాల ప్రతినిధులు ప్రతి ఒక్కరు తప్పకుండా ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుల భారీ సాంస్కృతిక ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ, మాదిగ జాతి ఉపకులాల పెద్దలు ఎర్రవటి పోశిరాం, మోచి గణేష్, అంబిలిపూర్ రాజు, ఎడ్ల గంగారాం, తూర్పాటి అంజయ్య, బాజా లాలూ, చిత్తారి సిద్ధప్ప, టేకుర్ల సాయిలు, దొబ్బల గంగాధర్, మురగళ్ల సాయిలు, కాశీరాం, హనుమాండ్లు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని ఎస్సీ బిడ్డలు హైదరాబాద్‌కు లక్ష డబ్బులు కార్యక్రమం విజయవంతం చేయాలని మాదిగ రాజకీయ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన తిరుగుతూ మాదిగలను ప్రతీ గ్రామంలో నుంచి రెండు బస్సులు వెళ్లడానికి ఏర్పాటు చేస్తున్నారు. పట్టుదలతో ప్రతీ గ్రామం నుంచి రెండు బస్సులు వస్తున్నాయి. చలో కామారెడ్డి, చలో హైదరాబాద్ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ప్రతీ గ్రామం నుంచి తరలి రావా లి. మాదిగ రాజకీయ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ నేషనల్ ప్రెసిడెంట్ బీఆర్ ఎస్ రమేష్‌కుమార్ మాదిగ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామం నుంచి లక్ష డబ్బు లు వెయ్యి గొంతులకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇందులో మాదిగ రాజకీయ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరు భాగయ్య మాదిగ, జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న మాదిగ, పుల్లూరి రాజలింగం, మెట్టు రామచంద్రం, మెట్టు ఎర్ర బాల్ రాజ్, భక్కోళ్ల నర్సింలు, పుల్లూరి సత్యం, ఈరమ్మొల్ల నర్సింలు, బురుగుపల్లి సుధాకర్, పుల్లూరి స్వామి, ఎరుకట్ల రవి, నక్క అరవింద్, రేకులపల్లి రాజశేఖర్, పుల్లూరి రాజు, మెట్టు నారాయణ తదితరులు ఉన్నారు.



బీర్కూర్ నుంచి బాసరకు కాలినడకన తరలివెళుతున్న భక్తులు

బీర్కూర్ నుంచి బాసరకు పాదయాత్ర

బీర్కూర్ ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా చదువుల తల్లి జ్ఞాన సరస్వతి దేవిని దర్శించు కునేందు కోసం ఆదివారం బీర్కూర్ మండల కేంద్రం నుంచి వందలాది మంది భక్తులు మహా పుణ్యక్షేత్రమైన బాసరకు పాదయాత్రగా తరలివెళ్లారు. బీర్కూర్ మండల కేంద్రంలోని స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంగారాం జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు. కొన్నేళ్లుగా బాసరకు పాదయాత్రగా తరలి వెళుతున్నామని, ఈ సారి వెళుతున్నా మని గురుస్వామి సుధాకర్ తెలిపారు. ఇది 10వ సారి పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం బాసరకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లింగం గురు స్వామి, గుడికొండ బాలకృష్ణ, డాక్టర్ బాలకృష్ణ, శశికాంత్, కొర్రి శివ కుమార్ యాదవ్, బీదరి రాజు, మల్లొడ్డి విఠల్, మల్లయ్యా గారి ఆకాష్ కుమార్, కందకుర్తి సంతోష్ గుప్తా, ఇన్ను రాములు, కర్క సిద్ధు, నారం శ్రీనివాస్, లాడేగామ్ సాయి కృష్ణ తదితరులు ఉన్నారు.

పలు ఆలయాల్లో వసంత పంచమి వేడుకలు



ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి వసంత పంచమి వేడుకలు ఆలయాల్లో ప్రారంభం అయ్యాయి. ఎల్లారెడ్డి మండలం గండి మాసానిపేట్‌లో వసంత పంచమి సందర్భంగా ఎల్లమ్మ గుడి వార్షికోత్సవం జరిపారు. పూజల్లో మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు సాయాగౌడ్, వెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్, శంకర్ గౌడ్, గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకుని సోమవారం వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

వివాహిత అదృశ్యం

● రామారెడ్డి ఎస్సై నరేష్



రామారెడ్డి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పల్ వాయి గ్రామంలో ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఆదివారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చాకలి శ్యామల (41) వివాహిత మహిళ అదృశ్యమైనట్లు భర్త స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేష్ వివరించారు.

నేడు రాంపల్లితండాలో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొననున్న ఎమ్మెల్యే

లింగంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంప ల్లి తండాలో సోమవారం జరగ నున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్ పాల్గొంటారని రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షుడు రఫీక్ తెలిపారు. కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు నాయకులు తరలిరావాలని కోరారు.

నేడు సంగమేశ్వర్‌కు ఎమ్మెల్యే రాక

దోమకొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి హజరౌతారని ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రావ్, పుట్ట బాపురెడ్డి, బాల్‌రెడ్డి, చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

.. మత్తడి పోచమ్మ ఆలయానికి భూమిపూజ

లింగంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహిమాన్వితమైన చారిత్రక ఆలయం మత్తడి పోచమ్మ ఆలయం పునర్నిర్మా ణానికి సోమవారం భూమి పూజ చేస్తున్నట్లు ఆ లయ కమిటి అధ్యక్షుడు అశోక్, గౌరవ అధ్యక్షుడు శంకర్‌గౌడ్‌లు తెలియజేశారు. ఆలయ నిర్మాణానికి గ్రామంలోని భక్తుల నుంచి రూ.20 లక్షల వరకు విరాళాలు సేకరించినట్లు వారు తెలిపారు.

గంగమ్మ ఉత్సవాలకు ఆహ్వాన పత్రిక అందజేత



రామారెడ్డి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపేట్ గ్రామంలో ఈ నెల 9, 10, 11వ తేదీల్లో గం గమ్మ ఆలయ ప్రారంభోత్సవంతో పాటు ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆదివారం రెడ్డిపేట్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం ప్రతినిధులు చంద్రబాబు, గణేష్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంచర్లలో నీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతు పనులు



పైప్‌లైన్ సమస్యను పరిష్కరిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కంచర్ల గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కాగా ఆదివారం పైప్ లైన్ మరమ్మతు పనులను గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎక్కడ నీటి సమస్య ఉన్న వెంటనే గుర్తించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

పరమార్థదేవ్‌కు సన్మానం

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రోబెల్స్ జరిగే యోగ క్యాంపులో పతంజలి యోగా సమితి రామ్‌దేవాబాబా శిష్యుడు పరమార్థదేవ్‌ని హిందూవాహిని సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా పరమార్థదేవ్ మాట్లాడుతూ ప్రతీ రోజు మన ఇళ్లలో ఏదో ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించడం అలవాటు చేసుకోవాలని వారానికి ఒకరోజు కుటుంబసమేతంగా గుడికి వెళ్లి హనుమాన్ చాలిసా పారాయణం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని జిల్లా సంయోజక్ సాయికిరణ్, క్రిష్ణ, దినేష్, శ్రీను, ప్రకాష్, మణికంఠ, సుదర్శన్, సురేష్ పాల్గొన్నారు.

